## క్లుప్తంగా

### తాగునీటి నాణ్యతా పరీక్షలు



తాగునీటి నాణ్యతా పరీక్షలను పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి తదితరులు

అనపర్తి: గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న జల్‌జీవన్ మిషన్ పనుల్లో భాగంగా జల్‌జీవన్ మిషన్ స్రవంతి సిబ్బంది శనివారం రామవరంలో తాగునీరు నాణ్యతా పరీక్షలు నిర్వహించారు. రామవరం శివారు కాలనీలో జలజీవన్ మిషన్ ఆర్గనైజేషన్ సోషల్ డెవలపర్ జె.శాంతకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) చైర్మన్, గ్రామ ఉపసర్పంచి సబ్బెళ్ల కృష్ణారెడ్డి పాల్గొని తాగునీరు నాణ్యతా పరీక్షలను పరిశీలించారు. స్రవంతి సిబ్బంది మల్టీ పారామీటర్ వాటర్ క్వాలిటీ ఫీల్డ్ టెస్టింగ్ పరికరాలతో నీటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం పరీక్షలు నిర్వహించే విధానాన్ని, ఉపయోగాలను ప్రజలకు, సచివాలయ సిబ్బందికి వివరించారు.

### గైట్ ప్రిన్సిపాల్‌కు అవార్డు



డాక్టర్ ఎండీ ధనరాజ్

రాజానగరం: గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్ ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ (ఐపీఏ) ఫెలోషిప్– 2022 అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు ముంబయిలోని ఐపీఏ ప్రధాన కార్యాలయం నుంచి వర్తమానం రావడంతో నాగపూర్‌లో జరుగుతున్న సదస్సులో ఈ అవార్డును అందుకునేందుకు పయనమయ్యారు. ఇండస్ట్రీ, అకడమిక్, డ్రగ్స్ రెగ్యులేటరీ విభాగాలలో అకడమిక్ విభాగం నుంచి ఆయన ఈ అవార్డుకు ఎంపికయ్యారు.

### ఘనంగా గ్రామోత్సవం



బలభద్రపురంలో వరహాస్వామి గ్రామోత్సవం చేస్తున్న భక్తులు

బిక్కవోలు: బలభద్రపురంలోని వరాహాస్వామి నూతన విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహించారు. శనివారం శ్రీదేవిభూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 26 విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నారు. ఈ సందర్భంగా గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయం వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### క్యాలెండర్ల పంపిణీ



కోరుకొండలో క్యాలెండర్లను పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

మధురపూడి: జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన జక్కంపూడి జైత్రయాత్ర నూతన సంవత్సర క్యాలెండర్లను శనివారం కోరుకొండలో పంపిణీ చేశారు. ఇక్కడి సచివాలయంలో పంచాయతీ సెక్రటరీ కె.రమేష్ బాబు ఆధ్వర్యంలో వీటిని వలంటీర్లు, సిబ్బందికి అందజేశారు. ఇవి గ్రామంలోని అన్ని కుటుంబాలకు పంపిణీ చేయాలని ఆదేశించారు. రైస్ కార్డుకు అనువుగా కొత్త కుటుంబాల విభజన కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఉప సర్పంచ్ నేతుల చిన్ని, ఎంపీటీసీ గొల్లపల్లి ప్రవీణ్, వైఎస్సార్ సీపీ నాయకులు బొరుసు బద్రీ, అయిల రామకృష్ణ, బొండాడ చందు పాల్గొన్నారు.

### పశు వ్యాధులతో అప్రమత్తం



పశువులను పరిశీలిస్తున్న డాక్టర్ సమత, నాగిరెడ్డి

అనపర్తి: కుతుకులూరులో లంపిస్కిన్(అమ్మవారు) వ్యాధి బారిన పడిన పశువులను వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి శనివారం పరిశీలించారు. వెటర్నరీ సర్జన్ డాక్టర్ సమతతో కలసి ఆయన పశువులను పరిశీలించి మాట్లాడారు. లంపి వైరస్ వలన ఎక్కువగా ఆవులకు ఈ వ్యాధి సోకుతుందని, దీని వల్ల పశువుల శరీరంపై చిన్న చిన్న కంతులు వస్తాయని, వ్యాధి వలన కాళ్ల వాపు వస్తుందని, తిండి మందగించడని తెలిపారు. వ్యాధి సోకిన పశువులను విడిగా ఉంచాలని, లేకుంటే మిగిలిన పశువులకు వ్యాధి సోకే ప్రమాదముందన్నారు. లంపిస్కిన్‌కు ఎటువంటి వ్యాక్సిన్ లేదని, యాంటీ బయాటిక్‌గా తమలపాకులు, మిరియాలు, బెల్లం, పసుపు కలిపి పెట్టాలన్నారు. జ్వరం తగ్గేందుకు ఇంజెక్షన్ చేస్తామన్నారు. శ్రీనివాసరెడ్డితో పాటు బ్రిక్స్ యూనియన్ అధ్యక్షుడు నల్లమిల్లి నాగిరెడ్డి ఉన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ఈలకొలనులో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- ఈలకొలనులో గడప గడపకూ మన ప్రభుత్వం

రంగంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఈలకొలను గ్రామంలో శనివారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వ పథకాలు సకాలంలో అందుతున్నాయా లేదా అని ఎమ్మెల్యే ఆరా తీశారు. పథకాల లబ్ధి వలంటీర్లు నేరుగా వచ్చి అందిస్తున్నారని ప్రజలు ఆనందం వ్యక్తం చేశారని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వాలు అమలు చేయని విధంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచారని చెప్పారు. వంత శాతం నవరత్న పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డిని మరొకసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీకో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ రాయుడు రాంబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అడబాల వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ, గ్రామ కన్వీనర్ బత్తిన రాముడు, సొసైటీ చైర్మన్ లంక రాజా శివమణికంఠ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి



కణుపూరులో జగనన్న లేఅవుట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మధురపూడి: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని కోరుకొండ ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ తెలిపారు. శనివారం కణుపూరు సచివాలయంలో ఈ పథకం లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోకాలంగా సొంతిల్లు లేక ఇబ్బంది పడుతున్న పేదలకు ఇది మంచి అవకాశం అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకుని గృహ నిర్మాణాలను చేపట్టాలన్నారు. తొలుత కణుపూరు, రాజవరం గ్రామాల్లోని జగనన్న లేఅవుట్లను ఎంపీడీఓ పరిశీలించి 121 మంది లబ్ధిదారులున్నట్టు గుర్తించారు. ఇందులో 20 ఇళ్ల నిర్మాణం పూర్తవుతుండగా, మరి కొంతమంది జాప్యం చేస్తున్నట్టు తెలుసుకున్నారు. వారికి అవగాహన కల్పించేందుకు సమావేశం నిర్వహించి మాట్లాడారు. నిర్మాణాలకు శ్రద్ధ చూపకపోతే వారి స్థానంలో స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న 40 మందికి అవకాశం కల్పిస్తామన్నారు. సర్పంచ్ కరణం రమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గృహ నిర్మాణ శాఖ ఏఈ ఆకుల వీరవెంకటరావు, పంచాయతీ కార్యదర్శి బి.దుర్గాభవాని పాల్గొన్నారు.

# కానిస్టేబుల్ పరీక్షకు సర్వం సిద్ధం



నన్నయ వర్సిటీ క్యాంపస్‌లో పోలీసులకు సూచనలు చేస్తున్న టేకి

రాజానగరం: పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఆదివారం జరుగనున్న పోలీసు కానిస్టేబుళ్ల పరీక్షకు రాజమహేంద్రవరం పరిధిలో భద్రతతో కూడిన ఏర్పాట్లు చేశామని రీజినల్ కోఆర్డినేటర్, నన్నయ వర్సిటీ ఓఎస్డీ ఆచార్య ఎస్.టేకి తెలిపారు. యూనివర్సిటీ ప్రాంగణంతో పాటు రాజమహేంద్రవరం, అనపర్తి, కొవ్వూరు కళాశాలల్లోని 29 కేంద్రాలలో 12,424 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరవుతారన్నారు. పరీక్ష కేంద్రానికి హాల్ టిక్కెట్‌తో పాటు ప్రభుత్వం గుర్తించిన ఐడీ ప్రూఫ్‌ను కూడా వెంట తీసుకుని ఉదయం 9 గంటలకే చేరుకోవాలని, 10 గంటల తరువాత ఎట్టి పరిస్థితుల్లో అనుమతించేది లేదని పేర్కొన్నారు. పోలీసు అధికారులతో కలసి పరీక్షలు జరిగే కొన్ని కేంద్రాలను ఆయన పరిశీలించారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, క్రైం బ్రాంచ్ ఏఎస్పీ జి.వెంకటేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీలు రామ్‌వర్మ, వెంకటేశ్వరరావు, సీఐ పి.కాశీవిశ్వనాథ్ ఉన్నారు.

**పరీక్ష కేంద్రంలో సర్వం సిద్ధం**

అనపర్తి: స్థానిక జీబీఆర్ డిగ్రీ కళాశాలలో పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్షలకు సర్వం సిద్ధం చేశారు. పరీక్షా కేంద్రం వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్సై పి.అప్పారావు తెలిపారు. ఈ పరీక్షలకు 668 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.

# నేడు కోటపాడులో సత్యసాయి వేడుకలు

రంగంపేట: సత్యసాయి బాబా కోటపాడు గ్రామాన్ని సందర్శించి 54 సంవత్సరాలు అయిన సందర్భంగా కోటపాడు శ్రీసత్యసాయి సేవా సదన్‌లో ఆదివారం ఘనంగా వేడుకలు నిర్వహిస్తున్నట్టు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కందర్ప వెంకట అమరనాథ్ తెలిపారు. సుప్రభాతం, నగర సంకీర్తన, సత్యసాయి బాలవికాస్ పూర్వ విద్యార్థులతో ప్రత్యేక పూజలు, పాల పొంగలి, సూర్యారాధన, ఆదిత్య హృదయం సామూహిక పారాయణ, బాలవికాస్ పూర్వ విద్యార్థుల సమావేశం, ఎగ్జిబిషన్, నారాయణ సేవ, గురువులకు సత్కారం తదితర కార్యక్రమలు జరుగుతాయని తెలిపారు.

# సమన్వయంతో జనార్దనస్వామి కల్యాణోత్సవాలు

ధవళేశ్వరం: ధవళగిరిపై వేంచేసి ఉన్న లక్ష్మీజనార్దస్వామివారి కల్యాణోత్సవాలను సమన్వయంతో విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ సూచించారు. భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా ధవళేశ్వరంలో జరిగే స్వామివారి కల్యాణోత్సవ ఏర్పాట్లపై దేవస్థానం, పంచాయతీ అధికారులతో శనివారం ఆయన సమీక్షించారు. ఫిబ్రవరి 1న కల్యాణోత్సవం, రథోత్సవం జరగనుంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లపై అధికారులకు చందన నాగేశ్వర్ పలు సూచనలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు, పంచాయతీ కార్యదర్శి సూరిబాబు, స్థానిక నాయకులు, పార్టీ శ్రేణులతో చర్చించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఏవిధమైన అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఏ సహాయం కావాలన్నా అందుబాటులో ఉండి పరిష్కరిస్తానని ఆయన తెలిపారు. స్థానిక రామపాద క్షేత్రం వద్ద గోదావరిలో స్నానం చేసే భక్తుల సౌకర్యార్థం బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

# సురక్షిత ప్రయాణం సాగించండి

**భద్రతా వారోత్సవాల్లో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా**



రహదారి భద్రతా వారోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రహదారి నిబంధనలు పాటించి ప్రతి ఒక్కరూ సురక్షిత ప్రయాణం సాగించాలని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా నగరంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించపోవడం, అతి వేగంగా నిర్లక్ష్యంగా ప్రయాణించడంతో విలువైన ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే హెల్మెట్ ధరించకపోవడంతో ప్రమాదాల్లో అనేక మంది మృత్యువాత పడ్డారన్నారు. దీనివల్ల ఆయా కుటుంబాల్లో విషాదం నిండిందన్నారు. సురక్షిత ప్రయాణం కోసం ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలను చేపడుతున్నామని రాజా అన్నారు. జిల్లా రవాణా అధికారి కేవీ కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 34వ జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించామన్నారు. హెల్మెట్ పెట్టుకోవడం వల్ల ప్రయోజనాలు, రహదారిపై రవాణా భద్రతా నియమాలు పాటించడంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. తద్వారా ప్రమాదాలు, మరణాల సంఖ్య తగ్గించడమే లక్ష్యమన్నారు. కలెక్టర్ కె.మాధవీలత ఆదేశాల మేరకు జిల్లాలో ప్రమాదాలను నివారించేందుకు ఈ ప్రక్రియను అందరి సమన్వయంతో కృషి చేస్తున్నామని అన్నారు. ఆర్టీవో కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ సెంట్రల్ జైల్, నందం గనిరాజు సెంటర్, తాడితోట, ఆర్టీసీ బస్టాండ్, మోరంపూడి జంక్షన్, సర్వీస్ రోడ్ మీదుగా లాలాచెరువు జంక్షన్ నుంచి ఆర్టీవో కార్యాలయానికి తిరిగి చేరుకుంది. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రంగనాయకులు, సంపత్, రామ్‌నారాయణ్, సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీదేవి, రాధిక, సుమా, సబితా తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- నాగంపల్లిలో గడప గడపకూ..



నాగంపల్లిలో ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: ప్రజా సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. శనివారం నాగంపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అధికారులు, పార్టీ నాయకులతో కలసి ఆయన నిర్వహించారు. ప్రతి ఇంటి వద్ద ఎమ్మెల్యే రాజాకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతుందని అన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. గత ప్రభుత్వంలో నాగంపల్లి అభివృద్ధికి కేవలం రూ.1.49 కోట్లు ఖర్చు చేశారని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చిన మూడున్నరేళ్లలో రూ 4.10 కోట్లు ఖర్చు చేశారన్నారు. రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయ భవనాలు నిర్మించడంతో పాటు, ప్రజల అవసరాల నిమిత్తం రూ.75 లక్షలతో డ్రైనేజీ వ్యవస్థ నిర్మిస్తున్నామన్నారు. ఆ పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. చింతల వెంకటరావు ఆధార్ కార్డులో వయసు తక్కువగా నమోదైందని, ప్రస్తుతం వయసు 70 ఏళ్లని, పింఛను రావడం లేదని ఎమ్మెల్యే రాజా దృష్టికి తీసుకుని రాగా తక్షణమే సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనారోగ్యంతో ఉన్న బి.ముసలయ్యను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కంటిపూడి సుమిత్ గుండెపోటుతో మరణించగా వారి తండ్రి వైఎస్సార్ సీపీ నాయకుడు కంటిపూడి శేఖర్‌ను పరామర్శించారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కోకన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, బూత్ కమిటీ అధ్యక్షుడు గద్దె వెంకటకృష్ణ చౌదరి, చల్లమళ్ల సుజీరాజు, సర్పంచ్ దోసపాటి వీరచంద్రరావు, ఎంపీటీసీ బిడిసే లక్ష్మి, వైస్ ప్రెసిడెంట్ దూళ్ల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# అ'పూర్వ' కలయిక



నల్గొండలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

సీతానగరం: పూర్వ విద్యార్థులంతా సందడి చేశారు. అలనాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. సీతానగరం ప్రభుత్వ హైస్కూల్‌లో చదివిన పూర్వ విద్యార్థులంతా శనివారం రఘుదేవపురం– నల్గొండ రోడ్డులోని పెందుర్తి హనుమంతరావు తోటలో కలుసుకున్నారు. మంతెన సుబ్బరాజు, మద్దిపాటి రాజశేఖర్, చెరుకూరి సుజాత ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల కలయిక జరిగింది. అమెరికాలో స్థిరపడిన ప్రవాస భారతీయులు జాస్తి వెంకట రామారావు, కోసూరి రాజేంద్రప్రసాద్‌రాజులను అడ్వకేట్ పెన్మత్స నందకిషోర్, పెందుర్తి హనుమంతరావు, సూరెడ్డి శివకుమార్ సన్మానించారు. కందుల ఉషారాణి, కానూరి పద్మ, నాగరాణి, సుద, చిలకమర్తి పార్థసారథి, నాగేంద్ర, లీలా వెంకటేశ్వరరావు, అరిసే రామలింగేశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నూరుశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి



కొమరిపాలెం పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ సత్యనారాయణ

బిక్కవోలు: నూరుశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని డివిజన్ పంచాయతీ అధికారి జె.సత్యనారాయణ అన్నారు. శనివారం కొమరిపాలెంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. సత్యనారాయణ మాట్లాడుతూ రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో రూ.53.81 కోట్లు వసూలు చేయవల్సి ఉండగా వాటిలో ఇప్పటి వరకూ రూ.12.38 కోట్లు మాత్రమే వసూలు చేశారని అన్నారు.

ఇంటి పన్నులు వసూలులో బిక్కవోలు డివిజన్‌లో మొదటి స్థానంలో ఉన్నా, ఇప్పటికి 52 శాతం మాత్రమే వసూలు చేశారన్నారు. ఫిబ్రవరి నాటి నూరు శాతం పూర్తి చేయాలన్నారు. అనంతరం తొస్సిపూడిలో చెత్త సంపద కేంద్రాని పరిశీలించారు. ఈ కార్యక్రమంలోని ఈవోపీఆర్డీ భవాని, పంచాయతీ కార్యదర్శిలు తదితరులు పాల్గొన్నారు.

## చర్చిలో దుస్తుల పంపిణీ



గంద్రేడు చర్చిలో వస్త్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు

పెదపూడి: ఏసుక్రీస్తు బోధనలు పాటిస్తూ ప్రతి ఒక్కరూ సమాజంపై సేవా దృక్పథం కలిగి ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్‌సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. గంద్రేడు గ్రామంలో చర్చిలో ఎంపీటీసీ గుత్తుల శివకుమార్ ఏర్పాటు చేసిన దుస్తులను చర్చి విశ్వాసులకు ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు శనివారం అందజేశారు. శివకుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, సర్పంచి కుడిపూడి మాధవిలత, ఉప సర్పంచి శ్రీనివాసు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గుత్తుల పోతురాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు కుడిపూడి శ్రీనివాసు, పిల్లి భాస్కరరావు, పెంకే ఏకాశి, తదితరులు పాల్గొన్నారు.

# సారా స్థావరాలపై దాడులు



ఈలకొలనులో సారా స్థావరాలను పరిశీలిస్తున్న పోలీసు, సెబ్ అధికారులు

రంగంపేట: సారా తయారీ, విక్రయాల్లో మండలంలోనే రెడ్ విలేజ్‌గా ఉన్న ఈలకొలనులో శనివారం పోలీసు, సెబ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా అమ్మకాలు నిర్వహించే ఇళ్లతో పాటు, సారా తయారు చేసే ప్రదేశాల్లో తనిఖీ చేశారు.

అనంతరం సెబ్ సీఐ వెంకటలక్ష్మి మాట్లాడుతూ మంగళగిరి సెబ్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు రాజమహేంద్రవరం అడిషల్ ఎస్పీ (సెబ్) పిట్టా సోమశేఖర్ ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో ఎటువంటి సెబ్ నేరములు కనుగొనలేదన్నారు. ఈ దాడుల్లో సూపర్నెంట్ రాంబాబు, ఎస్ఐ టి.రామకృష్ణ, పోలీసు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

### త్రిముఖ లింగేశ్వరునికి రుద్రాభిషేకం

బిక్కవోలు: కొంకుదురు గ్రామంలో కొలువైన ఉన్న బాలత్రిపుర సుందరి సమేత త్రిముఖ లింగేశ్వరునికి రుద్రాభిషేకం నిర్వహించారు. మాస శివరాత్రి సందర్భంగా అర్చకులు రమణ శర్మ ఆధ్వర్యంలోని నిర్వహించి ఈ కార్యక్రమంలోని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ పడాల వెంకటరామారెడ్డి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### వంగలపూడిలో ప్రచార రథం

సీతానగరం: శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి సనాతన హిందూ ధర్మ ప్రచార రథం వంగలపూడిలోకి శనివారం ప్రవేశించింది. సర్పంచ్ కొంచ అన్నపూర్ణ, వైఎస్సార్ సీపీ నాయకుడు కొంచ భాస్కరరావు ఆహ్వానం పలికారు. ప్రచార రథం ప్రెసిడెంట్ గాయకుడు కరుటూరి వెంకట శ్రీనివాసరావు రాత్రి 7 గంటల నుంచి 10 గంటల వరకు అన్నమయ్య స్వరార్చన కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### మహిళలపై దాడి

సీతానగరం: రఘుదేవపురానికి చెందిన పోలిమాలి సుబ్బారావు ఇద్దరు మహిళలపై దాడి చేశారని స్థానిక పోలీసులు తెలిపారు. శనివారం రవీంద్ర కాలనీకి చెందిన సుబ్బారావు తన ఎదురింటి వారు తరచూ ఘర్షణకు దిగుతున్నారంటూ తల్లీకుమార్తెలను సుత్తితో గాయపరిచాడు. వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కడియం: మాధవరాయుడుపాలెం పంచాయతీ పరిధిలోని చైతన్యనగర్‌కు చెందిన ఎస్.అప్పలనాయుడు (45) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పేపరుమిల్లులో అప్పలనాయుడు కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శనివారం అతని భార్య కూలి పనికి వెళ్లింది. కుమారుడు స్కూల్ నుంచి ఇంటికి వచ్చి తలుపు తీసి చూసేసరికి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ అప్పలనాయుడు కనిపించాడు. దీంతో కేకలు వేయగా చుట్టుపక్కల వారొచ్చి అతనిని ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు.

### ఎమ్మెల్యే రాజాకు కృతజ్ఞతలు



ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలుపుతున్న గద్దె వెంకటకృష్ణ చౌదరి

సీతానగరం: రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు వైఎస్సార్ సీపీ బూత్ కమిటీల అధ్యక్షుడు, పార్టీలో చేరికల కమిటీ కన్వీనర్ గద్దె వెంకటకృష్ణ చౌదరి (నల్లి) కృతజ్ఞతలు తెలిపారు. శనివారం నాగంపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించిన జక్కంపూడి రాజాను కలసి పుష్పగుచ్ఛం అందించి, తనకు పదవులు కేటాయించడంపై కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తనపై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి, పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి అహరిశలూ శ్రమిస్తానన్నారు.

### బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

అనపర్తి: ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలో నిర్వహించిన అంతర కళాశాలల మహిళ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో స్థానిక జీబీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి టోర్నమెంట్ విజేతగా నిలిచినట్టు కళాశాల పీడీలు ఎంవీవీ రామారెడ్డి, వి.జయరాజ్ తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా పెంటపాడు(తాడేపల్లిగూడెం)లోని డీఆర్ గోయాంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఈ నెల 20న జరిగిన ఈ పోటీల్లో జీబీఆర్ జట్టు విన్నర్స్‌గా నిలిచినట్టు తెలిపారు. ఆ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కళాశాలకు చెందిన కె.గాయత్రికిరణ్మయి, టి.పుష్పజ్యోతి, కె.వాణి, బి.సునీత ఆల్ ఇండియా అంతర విశ్వవిద్యాలయాల మహిళల బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు యూనివర్సిటీ జట్టులో చోటు దక్కినట్టు తెలిపారు. ఈ నెల 26 నుంచి తమిళనాడులోని చెన్నైలో డాక్టర్ బీఎస్ క్రెసెంట్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ క్రీడామైదానంలో జరిగే పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు. విద్యార్థులను విద్యాసంస్థల అధినేత తేతలి కొండబాబు, పాలక మండలి సభ్యుడు జి.రామారెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్‌పీ అబ్బాయి రెడ్డి తదితరులు అభినందించారు.

### విజయలక్ష్మి ఆరోగ్యం కోసం పూజలు

సీతానగరం: వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ఆరోగ్యం కుదుటపడాలని కోరుతూ తలుపులమ్మ లోవ అమ్మవారికి వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముద్దాల అను, రాష్ట్ర కార్యదర్శి లింగం రవి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అహర్నిశలూ కృషి చేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మికి సంపూర్ణ ఆరోగ్యం ప్రసాదించాలని పూజలు చేశామన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, యూత్ విభాగం సభ్యులు పాల్గొన్నారు.

### 24న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

అనపర్తి: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 24వ తేదీన నిర్వహించనున్నట్టు ఎంపీడీపీ బీఎల్ నరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ అధ్యక్షతన జరిగే ఈ సమావేశం మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

### ఆక్రమణలు తొలగించాలని వినతి

రంగంపేట: రంగంపేటలోని పెద్దరాయుడి చెరువు ఆక్రమణలు తొలగించాలని ఆ చెరువు ఆయకట్టు రైతులు శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. చెరువును కొందరు ఆక్రమించి దారులు, తూములు వేసుకున్నారని, వాటి వల్ల సాగునీరు సక్రమంగా అందడంలేదని రైతులు వాపోయారు. దీనిపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు వుండవిల్లి పద్దరాజు, జాస్తి శ్రీదేవి, వి. లక్ష్మి, వుండవిల్లి పద్మ తదితరులు పాల్గొన్నారు.